క్లుప్తంగా

వీరేశ్వరస్వామి దేవస్థానం పనితీరు భేష్

ఐ.పోలవరం: ఆలయ సంక్షేమం అమలులో మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థాన అధికారుల పనితీరు చాలా బాగుందని కాకినాడ ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శివదాస్ కొనియాడారు. సోమవారం ఆయన ఆలయంలో సంక్షేమ నిధి(ఈపీఎఫ్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివదాస్ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం సంక్షేమ నిధిని ఎటువంటి బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు కట్టడంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. అనంతరం సిబ్బంది అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఉద్యోగి మరణించినా, ఉద్యోగ విరమణ పొందినా ప్రావిడెంట్ ఫండ్ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కౌండిన్య, బి.వీరభద్రరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులను సత్కరించిన సవేర ట్రస్ట్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 550 మార్కులు పైబడి సాధించిన 20 మంది విద్యార్థులకు సోమవారం స్థానిక వెంకట కృష్ణాపురంలో సవేర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ పుస్తకం, బౌద్ధ గ్రంథాలు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.1,000 చొప్పున నగదు బహుమతి అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సవేర, వర్ధమాన కవి డాక్టర్ పాలమూరి విక్రమ్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి గెడ్డం ప్రదీప్, కుంచే వెంకటేశ్వరరావు, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి నామినేషన్ల ఉపసంహరణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బరిలో దిగిన దంగేటి రామకృష్ణ, బీర రాజకుమార్‌లు సోమవారం తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం 17 మందికి గాను ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో మరో 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినట్లు ఆర్వో వి.మదన్‌మోహన్‌రావు తెలిపారు.

నేడు ఆర్య వైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ వైశ్య నాయకుల ఆధ్వర్యంలో ఆర్య వైశ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య రాష్ట్ర నాయకుడు, పార్టీ నాయకుడు శ్రీఖాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనంలో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుల ప్రత్యేక పరిచయ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఆర్య వైశ్య ప్రతినిధులు ఈ ఆత్మీయ సమ్మేళనానికి విధిగా హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

దండోరా అంటే కొంతమంది మాదిగలేనా?

అమలాపురం రూరల్: దండోరా అంటే కొంతమంది మాదిగలే కాదని, జిల్లాలోని ఎమ్మార్పీఎస్‌లో మూడు గ్రూపులన్నాయన్న విషయాన్ని గంటి హరీష్ మాధుర్ గ్రహించాలని జిల్లా మాదిగల రాజకీయ జేఏసీ అధ్యక్షుడు కాప నాగభూషణం అన్నారు. ఆయన అధ్యక్షతన నడిపూడి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్ వద్ద మాదిగల రాజకీయ జేఏసీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో జిల్లా మాదిగ నాయకులు మాట్లాడుతూ తాము 30 ఏళ్లుగా టీడీపీ వెంటే ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నామని, కాని ప్రస్తుతం యాక్టింగ్ చేసే స్థానికేతరులకే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు తొత్తరమూడి ప్రభాకర్‌రావు, మంద వెంకటేశ్వరరావు, నూటికుర్తి మూర్తి, ఉందుర్తి సత్యనారాయణ, చుట్టుగుళ్ల వెంకటరమణ, సవరపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు

యానాం: సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల పలువురి జీవితాలు ఛిద్రమవుతున్నాయని ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్ఎస్ఎస్ యూనిట్, యానాం ట్రాఫిక్ పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాలైన గంజాయి తదితర వాటిని అలవాటు చేసుకోవడం వల్ల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. అందుకే యువత వాటి జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కుమార్ పాల్గొన్నారు.



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యే పొన్నాడ



ముఖ్యమంత్రి జగన్ చేతికి ఇమామ్ ఏ జామిన్ వస్త్రాన్ని కడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



అంబాజీపేటలో బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జననేతకు ఘన స్వాగతం



ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అల్లవరం: పి.గన్నవరం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ వద్ద అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకోవాలని సీఎం జగన్ వారికి సూచించారు.

జగన్ చేతికి 'ఇమామ్ ఏ జామిన్' కట్టిన ఖాదర్

అమలాపురం టౌన్: అంబాజీపేటకు ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు సోమవారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ చేతికి ఖాదర్ ఇమామ్ ఏ జామిన్ వస్త్రాన్ని కట్టారు. జగన్‌కు అల్లా అనుగ్రహం, ఇమాం రజా అలైహి సలాం కృప ఎల్లప్పుడూ ఉండాలని ఖాదర్ ప్రార్థించారు.



ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న ఎంపీ చింతా అనురాధ

దారులన్నీ అంబాజీపేటకే

అమలాపురం టౌన్: అంబాజీపేట సెంటరులో సోమవారం మధ్యాహ్నం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సభకు అమలాపురం నియోజకవర్గం నుంచి వేలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని దారులన్నీ అంబాజీపేట వైపే అన్నట్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్లు, మోటారు సైకిళ్లపై సభకు వెళ్లారు. సీఎం సభకు వెళ్లిన వారిలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, దేవరపల్లి గీత తదితరలున్నారు.

కొత్త మేనిఫెస్టోలో సంక్షేమ పథకాల పెంపు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- కామనగరువులో ఎన్నికల ప్రచారం

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చడమే కాకుండా ఇటీవల ప్రకటించిన కొత్త మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలను మరింతగా పెంచారని అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన అమలాపురం రూరల్ మండలం కామనగరువు పరిధిలోని చిట్టమ్మ చెరువు, పసిడిచెరువు, మెట్ల సత్యనారాయణరావు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన విశ్వరూప్‌కు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పూలు చల్లుతూ ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల వల్ల ఇంటింటికీ లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమం ప్రతి పేదవాడికి పారదర్శకంగా అందుతుందని, గ్రామాలు అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించాలని మంత్రి విశ్వరూప్ అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, సర్పంచ్ నక్కా అరుణ కుమారి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళీకృష్ణ, రాజులపూడి ఆనంద్, ములపర్తి శ్రీను, ఉర్రింగి నారాయణరావు, రాజులపూడి నాగేశ్వరరావు, సంసాని బాబి, ఎంపీటీసీలు మెండు గంగా భావానీ, గుత్తుల అనిత తదితరులు పాల్గొన్నారు.



కామనగరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్



కామనగరువులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు నిలవనున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, టీడీపీ అభ్యర్థిగా దాట్ల బుచ్చిబాబు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా వాకపల్లి బీమారావులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహన్‌రావు ఆయా పార్టీల గుర్తులను కేటాయించారు.

అమలాపురంలో 13 మంది పోటీ

అమలాపురం రూరల్: అమలాపురం నియోజకవర్గంలో 21 మంది నామినేషన్లు వేయగా సోమవారం ఉపసంహరణ అనంతరం 13 మంది పోటీలో నిలిచారు. వారికి గుర్తుల కేటాయించినట్లు ఎన్నికల అధికారి, ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ తరఫున పినిపే విశ్వరూప్, బహుజన్ సమాజ్ పార్టీ తరఫున పోలమూరి మోహనబాబు, టీడీపీ తరఫున అయితాబత్తుల ఆనందరావు పోటీలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం: మండలంలోని అయినాపురం పరిధిలో ఉన్న బాడవ, చిన మెట్టలంక, సత్తెమ్మ చెట్టు, చప్పిడివారిపాలెం గ్రామాలకు చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన సుమారు 200 మంది వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, మట్టపర్తి సురేష్, మట్టపర్తి సత్యనారాయణ, యనమదల రామకృష్ణ, రాయుడు చిన్నా, వాసంశెట్టి ఫణి, సానబోయిన మల్లిఖార్జునరావు, దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

విద్యా కుసుమాలకు గ్రామస్తుల సత్కారం



పాల జోషితను సత్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు

అల్లవరం: ఇటీవల విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు ఓడలరేవు గ్రామస్తులు సత్కరించారు. కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షులు తారాడి శివ ఆధ్వర్యంలో 595 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన పినపోతు ఈశిత, 591 మార్కులు సాధించిన చింతా నిషిత, 590 మార్కులు సాధించిన పాల జోషితలను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఒకేసారి ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందని శివ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పాలెపు శ్రీను, కొపనాతి వెంకటరాజు, కొప్పాడి దుర్గారావు, రేకాడి మార్కండేయ, పాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోప్ ఐలాండ్‌లో పొన్నాడ ప్రచారం



హోప్ ఐలాండ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



లక్ష్మీపతిపురంలో ప్రచారం చేస్తున్న పొన్నాడ సతీమణి నీరజ

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణతో కలిసి సోమవారం ఆయన కోరంగి గ్రామ పంచాయతీలోని హోప్ ఐలాండ్ దీవిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హోప్ ఐలాండ్ దీవిలో ఎమ్మెల్యే పొన్నాడ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని పొన్నాడ అభ్యర్థించారు. పొన్నాడ సతీమణి నీరజ, ఇతర కుటుంబ సభ్యులు గాడిమొగ పంచాయతీ గాడిమొగ, పెదవలసల, లక్ష్మీపతిపురం ప్రాంతాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమాల్లో కొపనాతి నాగరాజు, రేకాడి నరసింహమూర్తి, పోతాబత్తుల నూకరాజు, మల్లాడి శ్రీను, పెయ్యల శ్రీనివాస్, పోతుల రత్నకుమారి, వైదాడి ధర్మారావు, కామాడి భైరవమూర్తి, పెయ్యల తాతాజీ, చెక్కా కామేశ్వరరావు, కొక్కిలిగడ్డ లోకేష్, అరదాడి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ శ్రీధర్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ మహేశ్వరరావు

అమలాపురం టౌన్: మండలంలోని భట్నవిల్లిలో 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ సోమవారం ఉదయం పరిశీలించారు. ఆటోను చేపల లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టిన ఈ ప్రమాదంలో నలుగురు స్నేహితులు మృత్యువాత పడడంతో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని ఎస్పీ శ్రీధర్‌కు అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు వివరించారు. ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోను ఎస్పీ పరిశీలించారు. అనంతరం నేషనల్ హైవే అధికారులతో అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఎస్పీ శ్రీధర్ వెంట రూరల్ సీఐ పి.వీరబాబు, రూరల్ ఎస్ఐ శేఖర్‌బాబు తదితరులున్నారు.

శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలి

ఉమ్మడి జిల్లాల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా

అమలాపురం రూరల్: రానున్న ఎన్నికల్లో ప్రశాంత పోలింగ్ లక్ష్యంగా శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని ఉమ్మడి జిల్లాల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రా తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్థానిక ఎస్పీ ఎస్ శ్రీధర్ వివరించారు. అనంతరం దీపక్ మిశ్రా మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి, ఓటర్లు నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులు కల్పించాలన్నారు. ఎన్నికల్లో అన్ని రకాల ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేయాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించరాదని, జిల్లాలో రౌడీషీటర్లను గుర్తించి కౌన్సెలింగ్ చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లా సరిహద్దుల్లోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాల సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచామని, సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలూ నిరంతరాయంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న 1644 పోలింగ్ బూత్‌లను జియో మ్యాపింగ్ చేశామని కలెక్టర్ హిమాన్షుశుక్లా వివరించారు. తొలుత అమలాపురం విచ్చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి దీపక్ మిశ్రా, శాంతిభద్రతల అదనపు డీజీ శంఖబ్రతబక్షి, ఐజీ అశోక్ కుమార్‌లకు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

అల్లవరం: గ్రామాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం వివిధ శాఖల పనితీరు, ప్రగతిని ఆయా శాఖాధికారులు వివరించారు. సమావేశంలో వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు నిర్వహించి గిట్టుబాటు ధర పొందాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి స్వామి తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి 60 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధం ఉందని ఎఫ్‌డీఓ అశ్విని తెలిపారు. రూ.11.60 కోట్లతో 483 పనులను మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్నామని ఏపీఓ శ్రీనుబాబు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, పరిపాలనాధికారి లక్ష్మణరావు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ఉప్పలగుప్తం: సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అధ్యక్షతన ఎటువంటి తీర్మానాలు, ప్రజా సమస్యలపై చర్చలు లేకుండా సాదాసీదాగా నిర్వహించినట్టు ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగే సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చించి, అభివృద్ధి పనులపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల సమావేశం

అమలాపురం టౌన్: స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో మంగళవారం ఉదయం 11 గంటలకు అమలాపురం పట్టణ, రూరల్ మండలాల వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల కన్వీనర్లు, సభ్యులు, వార్డుల ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు సమావేశంలో పాల్గొంటారన్నారు. కావున కన్వీనర్లు, పార్టీ బూత్ కమిటీ ప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రూ.20.56 లక్షల సొత్తు సీజ్



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదుతో అమలాపురం పోలీసులు, నిఘా బృందం అధికారులు

అమలాపురం టౌన్: బంగారు ఆభరణాలు, నగదు తరలిస్తున్న కారును అమలాపురం పోలీసులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం రాత్రి పట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి కారులో రూ.18.21 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.2.35 లక్షల నగదును తరలిస్తుండగా నిఘా బృందాలతో పాటు అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్, ఎస్ఐ ఎన్అర్ కిషోర్‌బాబు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో తరలిస్తున్న సొత్తును, కారును సీజ్ చేశారు.

రూ.15 లక్షల నగదు పట్టివేత



చెక్‌పోస్టులో పట్టుకున్న నగదును సీజ్ చేస్తున్న అధికారులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ.15 లక్షల నగదును చెక్‌పోస్టు అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్ఈబీ మొబైల్ టీం ఎస్ఐ రామశేషయ్య తెలిపిన వివరాల మేరకు యానాం వైపు నుంచి కాకినాడ వైపునకు పీవీఎస్ భాస్కర సుబ్రహ్మణ్య రామరాజు, మందపాటి మహేష్ అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై నగదును తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. అయితే ఆ నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో బోర్డర్ మొబైల్ పార్టీ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం-2, చెక్‌పోస్టు సిబ్బంది సమక్షంలో నగదును సీజ్ చేసినట్లు రామశేషయ్య తెలియజేశారు.

13 మంది వలంటీర్ల రాజీనామా

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 13 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధారాణికి అందజేసినట్లు వారు తెలిపారు. తమకు ఎంతో గౌరవం ఇచ్చిన తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లకు మద్దతుగా నిలిచేందుకు రాజీనామా చేసినట్లు వారు ప్రకటించారు.